
# ఎంజీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 27 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో గత డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ పరీక్షల ఫలితాలను వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 6,927 మంది విద్యార్థులకు గానూ 25.8 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, 73.7 శాతం మంది ప్రమోట్ అయ్యారు. మూడో సెమిస్టర్‌లో 7,135 మంది విద్యార్థులకు 31.9 శాతం ఉత్తీర్ణత సాధించగా 67.8 శాతం మంది ప్రమోట్ అయ్యారు. ఐదో సెమిస్టర్‌లో 9,105 మంది విద్యార్థులకు 31 శాతం ఉత్తీర్ణత సాధించగా, 68 శాతం మంది ప్రమోట్ అయ్యారు. తమ ఫలితాలపై సందేహం ఉన్న విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ. 200 చెల్లించి మార్చి 6 లోపు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ఉపేందర్ రెడ్డి తెలిపారు.

రీవాల్యుయేషన్‌కు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ ఒకే చలాన్‌లో ఏక మొత్తంగా చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆల్వాల రవి పాల్గొన్నారు.





లక్ష్మీనరసింహుడికి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

# చేనేత పార్కు తెరుచుకునేదెప్పటికో!

- నాడు బ్యాంకులకు అప్పులు చెల్లించలేక మూత
- గతేడాది రూ.12.50కోట్లతో కొన్న కేసీఆర్ సర్కారు
- ప్రారంభానికి మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ
- నేడు కంపచెట్లతో నిరుపయోగంగా దర్శనం
- పునరుద్ధరిస్తే పూర్వవైభవం.. వేలాది మందికి ఉపాధి
- ఆశగా ఎదురుచూస్తున్న నేత కార్మికులు

## హ్యాండ్లూమ్ పార్కును పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

**'పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆషామాషీగా తీసుకోలేదు. ప్రధాని మోదీ ప్రభుత్వ ఆస్తులను అమ్ముతుంటే.. దివాలా తీసిన సంస్థలను కేసీఆర్ కొనుగోలు చేస్తున్నారు. రూ.12.50 కోట్లకు కొని హ్యాండ్లూమ్ పార్కును కొన్నాం. దీన్ని బ్రహ్మాండంగా రూపుదిద్దుతాం. అవసరమైతే మరో రూ.15కోట్లు ఖర్చు చేస్తాం. అందులో నుంచి వచ్చే లాభాలను పోచంపల్లి మండలంలోని ప్రతి నేత కుటుంబానికి అందజేస్తాం. పార్కుపై ఓనర్‌షిప్ నేతన్నలకే ఒప్పజెప్పతాం'**

*–గతేడాది ఆగస్టులో పోచంపల్లి పర్యటన సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన భరోసా ఇది.*



నిరుపయోగంగా మారిన హ్యాండ్లూమ్ పార్కు భవనం

### ₹12.50 కోట్లు వెచ్చించి..

అప్పుల భారంతో మూతపడడంతో బ్యాంకులు హ్యాండ్లూమ్ పార్కును వేలం వేశాయి. చేనేత కార్మికుల మేలు కోరి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేలంలో పాల్గొని రూ.12.50 కోట్లకు పార్కును దక్కించుకుంది. దాంతో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు కోసం మార్గం సుగమమైంది. అంతేకాకుండా రాష్ట్ర పార్కుగా ఏర్పడి మళ్లీ తెరుచుకుంటుందని అంతా భావించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ)/భూదాన్ పోచంపల్లి : చేనేత కార్మికులకు ఎంతగానో మేలు చేసే భూదాన్‌పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు ప్రారంభానికి అడుగులు ముందుకు పడడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా కనీసం చర్యలు కూడా తీసుకోపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. హ్యాండ్లూమ్ పార్కును కేంద్ర ప్రభుత్వం దివాలా తీయిస్తే.. నేత కార్మికుల కోసం నాటి బీఆర్‌ఎస్ సర్కారు కొనుగోలు చేసి పునరుద్ధరించాలని సంకల్పించిన లక్ష్యం నెరవేరడం లేదు. కంప చెట్లతో నిండిపోయిన పార్కు నిరుపయోగంగా దర్శనమిస్తున్నది. పార్కుకు పునర్వైభవం తీసుకొచ్చి అందుబాటులోకి తీసుకొస్తే వేలాది మంది నేతన్నలకు ఉపాధి లభిస్తుంది.

### నాడు అప్పల భారంతో దివాలా..

2008లో కేంద్ర ప్రభుత్వం స్కీమ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కుల పథకం కింద దేశవ్యాప్తంగా 26 పార్కులను నెలకొల్పింది. ఇందులో భాగంగా చేనేతకు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముక్కల గ్రామంలోని 22 ఎకరాల విస్తీర్ణంలో చేనేత పార్కును ఏర్పాటు చేసింది. రూ.45 కోట్ల వ్యయంతో 15 మంది ప్రమోటర్లు కలిసి పార్కును నిర్మించారు. ప్రాజెక్టులో ప్రమోటర్ల వాటాతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా వర్కింగ్ క్యాపిటల్ కాకుండా ఎన్‌హెచ్‌డీసీకి కేంద్రం చెల్లించింది. దాంతో పార్కు నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. రుణ గ్రహీతలు బ్యాంకులకు సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో గతేడాది పార్కు ఆస్తులను సీజ్ చేశారు. ఇలా అప్పుల భారంతో పార్కు మూతబడింది.

### కేటీఆర్ ప్రత్యేక చొరవ..

చేనేత పార్కును అందుబాటులోకి తెచ్చేందుకు మాజీ చేనేత, జౌళి శాఖల మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేశారు. బ్యాంకులు వేలం వేస్తున్న పార్కును ప్రభుత్వం వేలం పాటలో పాల్గొని దక్కించుకునేలా చొరవ తీసుకున్నారు. గతేడాది ఆగస్టు 12న భూదాన్‌పోచంపల్లి పర్యటన సందర్శంగా పార్కును సందర్శించారు. పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పార్కులో వచ్చే లాభం నేతన్నలకే దక్కుతుందని కూడా స్పష్టం చేశారు.

### వస్త్రాల నిల్వ కోసమేనా కొన్నది..?

హ్యాండ్లూమ్ పార్కు 22 ఎకరాల విస్తీర్ణంలో ఎంతో విశాలంగా ఉంటుంది. స్థలంతోపాటు గదులతో మంచి వసతులు ఉన్నాయి. అలాంటిది పార్కు కంప చెట్లతో నిండిపోయింది. పట్టింపు, పర్యవేక్షణ లేకపోవడం నిరుపయోగంగా మారింది. సిరిసిల్లలో తయారైన వస్త్రాలను ఈ పార్కులో గోడౌన్‌గా వినియోగించుకుంటున్నారు. ఎన్నికల సమయంలో లారీల్లో వస్త్రాలను తీసుకొచ్చి గోడౌన్‌లో భద్రపరిచారు.

### పునరుద్ధరిస్తే వేల మందికి ఉపాధి

పదిహేనేండ్ల క్రితం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేనేత పార్కును ప్రారంభించారు. 5,000 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో పార్కులో 1,200 మంది చేనేత కార్మికులకు ఉపాధి లభించేది. క్రమంగా ఆ సంఖ్య 200కి తగ్గింది. సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో కార్మికులు వీధిన పడ్డారు. మూతపడిన చేనేత పార్కును పునరుద్ధరిస్తే పూర్వ వైభవం వస్తుందని చేనేత కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే రానున్న రోజుల్లో వేలాది మంది చేనేత కార్మికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడనున్నది. వస్త్రాల తయారీలో కొత్తదనం, డిజైన్ల రూపకల్పనతోపాటు నాణ్యత పెరుగుతుంది.



పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు ద్వారం

### పార్కును అందుబాటులోకి తేవాలి



హ్యాండ్లూమ్ పార్కును వినియోగంలోకి తీసుకొస్తే కార్మికులకు ఉపాధి కలుగుతుంది. కార్మికుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. సాంకేతికంగా వృత్తిపరమైన శిక్షణ ఇస్తే కొత్త డిజైన్లు రూపొందించడం ద్వారా వ్యాపారాల్లో రాణించడానికి అవకాశం ఉంటుంది. చేనేత పార్కును పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అందుకు తగిన నిధులు కేటాయించాలి. నేత కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు, కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర కార్యాచరణ రూపొందించాలి. కార్మికులకు చేతినిండా పని కల్పించాలి.

– తడక రమేశ్, చేనేత నాయకుడు, భూదాన్‌పోచంపల్లి

# యాదగిరీశుడికి వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి మంగళవారం నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై ఊరేగించారు. లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణోత్సవంలో వైభవంగా సాగింది. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని వీక్షించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. పాత గుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయంలో చెంత గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించి లలితాపారాయణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 25,10,779 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.



యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హాల్ టిక్కెట్ నెంబర్లు వేస్తున్న పరీక్షల సిబ్బంది

# నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు.. హాజరుకానున్న విద్యార్థులు 12,559 మంది

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 27 : ఇంటర్మీయట్ వార్షిక పరీక్షలకు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. నేటి నుంచి మార్చి 16 వరకు కొనసాగున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లను విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ సీసీ కెమెరాల నిఘాలోనే జరుగనున్నది. ఈ సారి కూడా నిమిషం నిబంధన అమలు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకోవాల్సి ఉంటుంది.

### జిల్లాలో 30 కేంద్రాలు..

పరీక్షల కోసం జిల్లాలో 30 సెంటర్లను ఏర్పాటు చేశారు. రాజాపేట, మోత్కూర్, యాదగిరి గుట్టలో సెల్ఫ్ సెంటర్లకు అనుమతి ఇచ్చారు. మొత్తం 12,559 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 6,109 మంది, ద్వితీయ సంవత్సరం 6,450 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణకు 30 మంది సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్, 30 మంది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పనిచేయనున్నాయి.

### సెంటర్‌ను గుర్తించేందుకు యాప్

సీసీ కెమెరాల ఎదుటే ప్రశ్న పత్రాలను విడుదల, సమాధాన పత్రాలను సీల్ చేయడం వంటివి కొనసాగుతాయి. సమీప పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను సరఫరా చేసే బాధ్యత కస్టోడియన్లకు అప్పగించారు. పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు సెంటర్ లొకేటర్ యాప్‌ను రూపొందించారు. అందులో హాల్ టికెట్ నంబర్ నమోదు చేస్తే విద్యార్థి ఉన్న ప్రదేశం నుంచి పరీక్షా కేంద్రం ఎంత దూరంలో ఉన్నది, అక్కడికి ఎలా చేరుకోవాలనేది ఈ యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. పరీక్షల నిర్వహణలో ఏ సమస్య ఉన్నా 8519942273 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని, కలెక్టరేట్‌లోని జి-12 ఇంటర్మీడియట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ సి.రమణి తెలిపారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- ఏసీపీ మధుసూదన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మధుసూదన్ రెడ్డి, పక్కన జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 27 : మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సార్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని, పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైతే భార్యాభర్తల మధ్య దూరం పెరిగే అవకాశం ఉందని అన్నారు. గృహ హింస సమస్యలపై ప్రభుత్వ అధికారులు అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సమస్యల పరిష్కారానికి కమిటీల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, మహిళలపై జరుగుతున్న హింసను తగ్గించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి మాట్లాడుతూ కుటుంబంలో మొదటి గురువు స్త్రీ అని, పిల్లలను పెంచడంలో సమానత్వాన్ని చూపించాలన్నారు. పిల్లలను అర్థం చేసుకుని గుణాన్ని సర్దుబాటు అయ్యే లక్షణాన్ని చిన్న తనం నుంచి అలవర్చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి , సార్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమీల, సఖి సిబ్బంది లావణ్య, సుమలత, సార్ప్ సిబ్బంది సరిత, స్వరూప అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.




శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్

# లక్ష్మీనరసింహుడి కల్యాణానికి రండి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 27 : మండలంలోని నమాత్‌పల్లిలో పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం మార్చి ఒకటిన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అతికం లక్ష్మీనారాయణగౌడ్ తెలిపారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి అందజేసినట్లు తెలిపారు.

# కలెక్టరేట్‌లో దొంగ ఉద్యోగాలు

- ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాకం
- ఉద్యోగాల పేరిట నకిలీ ఉత్తర్వులు
- అమాయకులను మోసం చేసి రూ.30లక్షలకుపైనే వసూలు?
- కలెక్టరేట్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితిలో అధికారులు



ఫేక్ నియామక పత్రం

సూర్యాపేట, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి ఓ ఏజెన్సీ అమాయకులను బురిడీ కొట్టించి లక్షల్లో దండుకున్నది. ఏకంగా జిల్లాస్థాయి అధికారులు ఉండే కలెక్టరేట్‌లో ఓ ముగ్గురికి నకిలీ పోస్టింగ్‌లు ఇచ్చి వేతనాలు కూడా అందిస్తున్నది. వారిని ఎరగా చూసి మరో పాతిక మందికి దగ్గరి నుంచి పెద్దమొత్తంలో సొమ్ము కాజేసింది. డబ్బు తీసుకున్న వ్యక్తి ఎంతకీ ఉద్యోగాలు చూపించకపోడంతో బాధితులు నిలదీయగా.. విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటిదాకా కలెక్టరేట్‌లో ఫేక్ జాయినింగ్ ఆర్డర్‌తో మూడు నెలలుగా పని చేస్తున్న వారిని గుర్తించిన వారే లేకపోవడం విడ్డూరం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట కలెక్టరేట్‌లో పారిశుధ్య పనుల కోసం ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మణికంఠ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు ఆరు నెలల కిందట నెలల కిందట ముగ్గురిని విధుల్లోకి తీసుకున్నారు. ఆ ముగ్గురికి నెల నెలా 5వేల రూపాయల నుంచి 7 వేల రూపాయలు వేతనం ఇస్తూ ఐదు నెలల తరువాత 22 వేలు వస్తాయని నమ్మించారు. ఆ ముగ్గురికి అటెండెన్స్ తీసుకునేందుకు మరో యువతిని నియమించి ఆమెకు నెల నెలా 18 వేల చొప్పున వేతనం ఇస్తూ విషయం బయటకు తెలియకుండా మేనేజ్ చేశారు. ఇలా మొత్తం నలుగురికి వేతనాలు ఇస్తూ వారి ద్వారా తెలిసిన వారిని శానిటేషన్ ఉద్యోగాల్లో చేర్చుకుంటామని చెప్పి ఒక్కొక్కరి నుంచి లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల వరకు దాదాపు 25 మంది నుంచి వసూలు చేసినట్లు బాధితులు చెప్తున్నారు. కొద్దిమందికి పారిశుధ్య పనులు చేసేందుకు ఉత్తర్వులు కూడా ఇవ్వడం గమనార్హం. ఇంకొందరికి వారంలో.. పది రోజుల్లో ఇస్తామంటూ రోజూ తిప్పించుకుంటున్నారు. ఇలా నెలలు గడుస్తుండడంతో తమకు ఉద్యోగాలైనా ఇవ్వండి లేదంటే తమ డబ్బులైనా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గల ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఉద్యోగాలిస్తామని నమ్మబలికి డబ్బులు తీసుకున్న ఏజెన్సీ నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగడం... విషయం మీడియా, పోలీసులకు తెలియడంతో శంకర్ అనే వ్యక్తితోపాటు బాధితులను పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. బాధితుల వద్ద ఉన్న ఒక ఉద్యోగ నియామక పత్రం సరైనదా, కాదా అని జిల్లా ఉపాధి కల్పన అధికారి అక్బర్ హబీబ్‌ను వివరణ కోరగా అది ఫేక్ అని తేల్చారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో తాగునీరు లేక, బాత్‌రూముల్లో నీళ్లు అందుబాటులో లేక అనేక సార్లు ఉన్నతాధికారులకు లేఖలు సమర్పించినా ఫలితం లేకపోవడం, ఇప్పుడు కలెక్టరేట్‌లోనే ముగ్గురు ఔట్‌సోర్సింగ్ పేరిట విధులు నిర్వహించినా కనీసం గుర్తించలేని పరిస్థితి నెలకొనడం పట్ల సమీకృత కలెక్టరేట్ నిర్వహణ ఎంత అధ్వానంగా తయారైందో తేటతెల్లం చేస్తున్నది.



సూర్యాపేట మెయిన్ రోడ్డులో ప్రైవేట్ కార్యాలయం ఎదుట బాధిత మహిళలు



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

# వైభవంగా యోగానందుడి రథోత్సవం

అర్వపల్లి, ఫిబ్రవరి 27 : అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఈ వేడుక కనుల పండువగా సాగింది. లక్ష్మీనరసింహ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత సప్త రుషి పూజలు, బలిహరణ చేశారు. స్వామి, అమ్మవార్లతో పల్లకిలో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి రథం పైకి తీసుకెళ్లి ఉత్సవాన్ని మొదలు పెట్టారు. మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో మధ్య రథోత్సవంగా ఘనంగా జరుగగా భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. ఈ సందర్భంగా గోవింద, లక్ష్మీనరసింహ నామస్మరణలు మార్మోగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్‌ఐ మహేంద్రనాథ్ గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు, దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నాయకులు మోరపాక సత్యం, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, శిగ నసీర్ గౌడ్, వేల్పుల రమేశ్, అర్చకులు రాంబాబు, పవన్‌కుమార్, వరదాచార్యులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : ఆకారంలో వరి పంటకు ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు బాబు

# వరి పైరుకు ట్యాంకర్ నీళ్లు

*చేతికి అందివస్తున్న పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరిచేను కండ్ల ముందే ఎండిపోతుంటే తట్టుకోలేని రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన జవ్వాజి బాబు రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని ఐదేండ్లుగా వరి సాగు చేస్తున్నాడు. ఈ సంవత్సరం ఎన్నడూ లేనంతగా భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నీళ్లు పోయడం తగ్గింది. పొట్ట పోసుకునే దశలో ఉన్న వరి పంట నీళ్లు లేక ఎండిపోతున్నది. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని ఆ రైతు నీళ్ల ట్యాంకర్‌తో పొలాన్ని తడుపుతున్నాడు. ట్యాంకర్ కిరాయి రోజుకు రూ.500, డీజిల్‌కు మరో రూ.500 ఖర్చు పెడుతున్నాడు. ఇంకో 20 రోజులు నీళ్లు అందిస్తే పంట చేతికొస్తుందని రైతు బాబు ఆవేదనతో చెప్పుకొచ్చాడు.*

*–శాలిగౌరారం, ఫిబ్రవరి 27*

# వైద్యారోగ్య శాఖలో పోస్టులకు దరఖాస్తులు

నీలగిరి, ఫిబ్రవరి 27 : జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు మార్చి 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అన్నిమల్ల కొండల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్-2, పీడియాట్రిషన్-1, రిఫ్రిజిరేటర్ మెకానిక్-1, ఎంఎల్‌హెచ్‌పీ-10, స్టాఫ్ నర్సు-20, ఫార్మసిస్ట్-2, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్-1, క్వాలిటీ మేనేజర్-1, సైకాలజిస్ట్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు https:// nalgonda. telangana.gov.in వైబ్‌సైట్‌లోగానీ, కార్యాలయంలోగానీ సంప్రదించి తెలుసుకోచ్చని తెలిపారు.